# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగి నప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **12** జూలై **1985** సంపుటి **5**


# సంపాదకీయము

## బోధకుల కొరకు మాట

## *(A Word to Preachers)*

దేనినైనా యితరులకు బోధించువాడు, ఉపదేశించువాడు, ప్రకటించువాడు బోధకుడు. క్రీస్తునందున్న విశ్వాసిగా అతడు బైబిలును బోధిస్తాడు, క్రీస్తు దేవుని కుమారుడని ప్రకటిస్తాడు; క్రీస్తు సువార్తను క్రైస్తవ్యాన్ని, క్రీస్తు రెండో రాకడను గూర్చి, రాబోవు తీర్పును గూర్చి, నీతిమంతులు దుర్మార్గులు తమ నిత్యత్వాన్ని గడిపే పరలోకము నరకము ఉన్నదని అతడు బోధిస్తాడు.

బోధకుడవడానికి ఎవడు బలవంతము చేయబడడు. తెలియకుండగానే దేవుడెవరినీ ఏర్పరచుకోడు, ఆ తరువాత అతడు బోధకునిగా పిలువబడ్డాడని తెలియజేసే గురుతులనియ్యడు. మనందరము సువార్త వలన లేక సువార్తద్వారా పిలువబడ్డామని లేఖనములు చెప్పుచున్నవి. క్రైస్తవులగుటకు, దేవుని పిల్లల మగుటకు మనందరినీ సువార్త పిలుచుచున్నది (2 థెస్స 2:14). తరువాత క్రైస్తవునిగా, మీరు లోకాన్నం

తటికి సువార్త ప్రకటించాలని ప్రభువు ఆజ్ఞాపించాడు (మార్కు 16:15; మత్తయి 28:19, 20). అయితే ఆ మాటలు క్రీస్తు అపొస్తలులతోనే చెప్పాడని నీవనుకోవచ్చు. అది నిజమే. అయితే యేసు వారికేమి బోధించాడో దానినే మార్పుజెందిన వారికి అపొస్తలులు బోధించాలని ఆయన వారి నాజ్ఞాపించాడు. లోకానన్నంతటికీ సువార్త ప్రకటించాలనేది అందులో ఒక భాగము. అయితే మిగిలిన అర్హత లేమిటి? సువార్త బోధించాలనే కోరిక అందులో ఒకటి. దాన్ని బోధించే శక్తి కలిగి యుండుట మరొకటి. దాన్ని నిరూపించడానికి ఒకడు బోధించేదాన్ని ఆచరించాలి. ఇట్టి అర్హతలు లేనివాడెట్లు బోధకుడు కావాలనుకొంటాడు?

"బోధించేటప్పుడు పరిశుద్ధాత్మ నన్ను నడిపిస్తాడు. నేనేమి పలకాలో నాకు తెలియజేస్తాడు" అని కొందరు చెప్పడానికి తయారవుతారు. దేవుని వాక్యమువలన గాక దానికి వేరుగా యుండి నీవేమి చెప్పాలో ఆత్మ నీకు తెలియజేస్తాడని తలంచుచుంటే నిరాశ జెందాల్సి యుంటాది. వాక్యాన్ని లిఖించడానికి కొందరికి మాత్రమే పరిశుద్ధాత్మావేశము ఇయ్యబడింది. అందువలన లేఖనములన్నియు దైవావేశము వలన కలిగినవని పౌలు చెప్పాడు (2 తిమో 3:16, 17). మనం దైవోపదేశాలను బోధించాలని ఆత్మావేశము కలిగిన పేతురు వ్రాసాడు (1 పేతురు 4:11). మనం వాక్యాన్ని ప్రకటించాలని పౌలు చెప్పాడు (2 తిమో 4:2). ఆత్మ తన వాక్యంలో చెప్పియున్న దాన్ని మించి చెప్పడానికి నిన్ను ఎక్కడకో నడిపిస్తాడనుకొనుచున్నావా? అట్లయితే ఆత్మ తనకు తానే విరుద్ధముగా యున్నట్లగుపడతాడు. నిజానికి మనం లేఖనాలను చదవాలని, పరిశోధించాలని ఆయన ఆజ్ఞాపించాడు (2 తిమో 2:15). బోధించు నా మిత్రుడా, బైబిలును చదువుట ద్వారానే నీవు దేవుని చిత్తాన్ని తెలిసికోగలుగుతావు. బైబిలు చదవకుండా నీవు బోధించుచున్నట్లయితే, నీవేమి విన్నావో, గమనించావో, నీవేమి

తలంచుచున్నావో దానినే బోధిస్తావు; అప్పుయితే నీవు సత్యాన్ని బోధించలేవు. నీకు తెలిసినదాన్నే బోధించగలవు. దేవుని వాక్యం తెలియకపోతే నీవు దాన్ని బోధించలేవు. సత్యవాక్యాన్ని గ్రహించు కోకపోతే నీవు దేవుని సత్యాన్ని, ఆయన చిత్తాన్ని ప్రకటించలేవు. దేవుని సత్యాన్ని బోధించడానికి ఆత్మ నీకొక ప్రత్యేక బయల్పాటు ఇయ్యడు.

క్రైస్తవ కళాశాలలకు, సెమినెరీలకు వెళ్ళకుండగానే నీవు బోధకుడవు కాగలవు. అయితే క్రైస్తవుడవు కాకుండా నీవు బోధకు డవు కాలేవు. సువార్తకు లోబడడానికి నీవు సుముఖుడవు కాకపోతే యితరులు సువార్తకు లోబడాలని నీవు బోధించలేవు. ఆ విషయంలో విజేయుడవు కాలేవు. నీవు క్రైస్తవ జీవితాన్ని జీవించుచుంటేనేగాని, వాక్యాన్ని సరిగా బోధించలేవు. నీవు బోధించేది ఆచరించకపోతే నిన్ను ప్రజలు ఇట్టే పసిగట్టేస్తారు, నీవొక వేషధారివని గమనించేస్తారు. పౌలు ఈ సూత్రాన్నే బోధించాడు: "ఎదుటి వానికి బోధించు నీవు నీకు నీవే బోధించుకొనవా? దొంగిలవద్దని ప్రకటించు నీవు దొంగిలెదవా? వ్యభిచరింపవద్దని చెప్పు నీవు వ్యభిచరించెదవా? విగ్రహములను అస హ్యించుకొను నీవు గుళ్ళను దోచెదవా? ధర్మశాస్త్రమందు అతిశ యించు నీవు ధర్మశాస్త్రము మీరుటవలన దేవుని అవమానపరచెదవా? వ్రాయబడిన ప్రకారము మిమ్మునుబట్టియే గదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది?" (రోమా 2 : 21-24). మోషే ధర్మశాస్త్రాన్ని బట్టి జీవించినవారితో పౌలు ఇక్కడ ఈ మాటలు చెప్పాడు. గాని అతని సూత్రము క్రీస్తు సువార్తకును, క్రైస్తవ్యానికిని అదే రీతిగ వర్తిస్తాది.

బోధకునిగా యుండుట వలన సులభంగా జీవనోపాధి జరిగి పోతా దని, గౌరవము లభిస్తాదని, మరి ముఖ్యముగా విదేశీయులతో సంబం ధము ఏర్పడతాదని తలంచి కొందరు యౌవనస్థులు బోధకులు కావా

లను కొంటారు. తాము విదేశీ సహాయం పొందగలమనీ, ఏమైనా శిక్షితు కొరకు పాశ్చాత్య దేశాలు వెళ్ళే అవకాశం దొరుకుతాదని వారు తలుస్తారు. అయితే బోధకుడు కావడానికి ఇవన్నీ దురుద్దేశాలే. నీవందు కొరకే బోధకుడవైతే తక్షణమే దాన్ని విసర్జించాలి. అందు కొరకే నీవు బోధకుడవు కాగోరుచున్న యెడల, నీవింకో వృత్తిలో ప్రవేశించుటకు నిర్ణయించుకోవాలి.

పనివాడు జీతమునకు పాత్రుడని బైబిలు బోధించుచున్నది. అంటే బోధకుడు తన సమయాన్ని బోధించుటలో పూర్తిగా వినియోగిస్తే అతడు జీతమునకు అర్హుడు (లూకా 10 : 7; 1 తిమో 5 : 18). అయితే నీవు పనిచేయుచోట సంఘము లేకపోతే యెలా? అప్పుడు నీ పనికి సహాయము చేయగల సంఘమును నీవు తయారు చేయగలిగేంత వరకు ఆ సహాయాన్ని నీకివ్వడానికి యెవరినో ఒకరిని లేదా ఒక స్థానిక సంఘాన్ని నీవు కనుగొనవలసి వస్తాది. లేదా నీ పనికి సంపూర్ణ సహాయం యిచ్చే సహోదరులు తయారయ్యే వరకు నీ చేతితో, మనస్సుతో కష్టపడి పనిచేసుకుంటూ సువార్త చేయాలి. 1 కొరింథీ 4 : 12 ప్రకారము పౌలు అట్లు చేసాడు. నీవెందుకు చేయలేవు? అలా పనిచేసుకొంటే బాగోదని నీవనుకొంటే, బోధకునిగా యుండడానికి నీవు పనికిరావు.

కొంతమంది బోధకులను బట్టి చాలమంది స్థానిక ప్రజలు నిరాశ జెందుతూ యుంటారు. గవర్నమెంటు ఆఫీసులలోను, పాఠశాలలోను పనిచేసేలాంటి వృత్తివలె బోధకునిది కూడ అదే రకమైన వృత్తియని వారనుకుంటారు. ఇంకోమాటలో అదొక ఉద్యోగము, డబ్బు సంపాదించే ఒక మార్గము. ఎవరైనా వచ్చి మత సంబంధంగా ఇదో అదో చేయమని కొంత డబ్బు యిస్తే వారు యిట్టే వారివైపు తిరిగి పోతారు. అట్టివారు తమకు తామును, దేవుని పిల్లలకును, దేవునికిని సిగ్గుకరమైన వారు, అపకీర్తి తెచ్చువారు.

ఇంకా ఎన్నో నేను చెప్పగలను; గాని బోధకుడవైన నీకును బోధకులు కాగోరుచున్న యౌవనస్థులకును కొన్ని సలహాల నిస్తూ దీన్ని సంగ్రహముగా చెప్పగోర్తాను :

1. క్రీస్తుకు విధేయుడవై క్రీస్తు స్థాపించిన సంఘ సభ్యుడ వగుము.

2. నీ జీవిత విధానాన్ని బట్టి క్రైస్తవుడవని నిరూపించుము; వేషధారివలె యుండకుము.

3. బైబిలును ప్రతిదినము చదువుము. బైబిలు జ్ఞానాభివృద్ధి కొరకు అనేక బైబిలు కరస్పాండెన్సు కోర్సులున్నాయి. క్రైస్తవ పుస్తకాలున్నాయి. అనుభవం గల క్రైస్తవులతో కలసి పఠించుము.

4. నీ మిత్రులకు, నీ చుట్టునున్న వారికి క్రీస్తును గూర్చి, క్రైస్తవులవడంగూర్చి చెప్పుము.

5. బహిరంగముగా బోధించే అవకాశం వచ్చినప్పుడల్లా దాన్ని వినియోగించుకొనుము. నమ్రత కలిగి, ప్రార్థనపరుడవై, ఆసక్తి గలిగి యుండుము. సత్యాన్ని మాత్రమే ప్రకటించుము.

6. పెండ్లి చేసుకొనేటప్పుడు క్రైస్తవ స్త్రీని మాత్రనే పెండ్లి చేసుకొనుము. నీకామె సహాయం అవుసరం. క్రైస్తవ కుటుంబము, గృహము నీ కవుసరం.

7. డబ్బుకొరకు బోధించవద్దుగాని నీవు క్రైస్తవుడవైనందున, దేవుని, మానవుల ఆత్మలను ప్రేమించుచున్నందున బోధించుము.

8. సంఘమునుండి నీకు సహాయం యేమీ లేకపోతే, నీ కష్టార్జితమువలన నీ కుటుంబాన్ని నడుపుతూ, సహాయంచేసే పరిస్థితికి ఎదిగే సంఘాన్ని కట్టుటకు ప్రయత్నం చేయుము.

9. ఎల్లప్పుడు సత్యాన్నే ప్రకటించుము. ఏ వ్యక్తికొరకైనను, ఏ కారణంచేతనైనను దాన్ని మార్చవద్దు, రాజీ పడవద్దు.

నీ జీవితాన్ని క్రీస్తు మాదిరినిబట్టి మల్చుకొని, లేఖనాల్లో కనబడే బోధకునిగా నీవుండ ప్రయత్నించిన యెడల ప్రభువు నిన్ను దీవిస్తాడు, ఆయనకొరకు నీకు గొప్ప పని అప్పగిస్తాడు. అంతేగాక నీ చుట్టు యున్నవారు నిన్ను గౌరవిస్తారు. మరియు నిన్ను నీవే గౌరవించుకొంటావు. నేడు భారతదేశంలో నీలాంటి అనేకమైన బోధకులు అవసరం.

---

నేనేల క్రీస్తు సంఘ సభ్యుడనైతిని - 1

## అది లేఖనార్థమైన నిర్మాణికుడగు క్రీస్తుచే స్థాపించబడినది

*(It was Founded by the Scriptural Builder — Christ)*

### I లేఖనార్థమైన నిర్మాణికునిచే స్థాపించబడని సంఘమేదైనను లేఖనముల ప్రకారమైనది కాదు

మతసంబంధ సంస్థ ఏదైనా ఉన్నదంటే, దానిని ఎవరో ఒకరు స్థాపించి యుంటారు. ప్రపంచములో నేడు పలువిధములైన సంఘము లనేకములున్నాయి. వాటి ఆరంభములోను, బోధలోను, ఆచరణలోను అవి వేర్వేరుగ యున్నాయి. గనుక అవి లేఖనముల ప్రకారముగానో లేక విరుద్ధముగానో దేవునిచేగాని లేక మానవునిచేగాని స్థాపించబడి యున్నాయి. గనుక ఒక సంఘముయొక్క నిర్మాణికుడు లేఖనార్థమైనవాడో కాడో తెలిసికొనుట ప్రాముఖ్యము. ఏదైనా సంఘము లేఖనార్థముకాని నిర్మాణికునిచే స్థాపించబడితే, ఆ సంఘము లేఖనార్థము కానిదవుతాది; అది క్రీస్తుపనిగాక మానవునిపని అవుతాది.

### II క్రీస్తు లేఖనార్థమైన సంఘాన్ని స్థాపించాడు

1. పైన చెప్పబడినదానికి ఋజువుగా, సంఘాన్ని స్థాపిస్తానని క్రీస్తు చెప్పిన మాటలను ఇక్కడ చూచుకొందాము: "ఈ బండమీద

నా సంఘమును కట్టుదును" (మత్త 16:18). సంఘము క్రీస్తుచే స్థాపించబడకపోతే అది లేఖనార్ధమైనది ఖచ్చితంగా కాదు. ఏ సంఘమయినను హెన్రీ VIII వలన గాని, జాన్ కేల్విన్, జాన్ వెస్లీ, జోసఫ్ స్మిత్ Jr., లేక మరి ఏ మానవునివలనగాని స్థాపించబడితే అది నిస్సందేహంగా మానవునిదే.

2. సంఘాన్ని స్థాపిస్తానని చేసిన వాగ్దానముతో బాటు యేసు సంఘములోకి ప్రవేశించే షరతులను ప్రకటించే అధికారాన్ని పేతురుకు యిచ్చాడు : "పరలోక రాజ్యముయొక్క తాళపు చెవులు నీ కిచ్చెదను. నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని" అతనితో చెప్పాడు (మత్త 16 : 19). ఏ మానవునికి సంఘాన్ని ఆరంభించే ఆత్మీయాధికారము లేనందున, ఈ మాటలు చెప్పడానికి ఏ మానవునికి ఆత్మీయాధికారము లేదు. ఇహాపరములయందు సర్వాధికారము కలిగినవాడు, సంఘాన్ని స్థాపించినవాడు మాత్రమే ఈ మాటలను అధికారపూర్వకంగా చెప్పగలడు.

## III బాప్తిస్మమిచ్చు యోహాను సంఘాన్ని స్థాపించలేదు

1. బాప్తిస్మమిచ్చు యోహాను సంఘాన్ని స్థాపించాడని చాల మంది అనుకొంటారు. అయితే అది క్రీస్తుచే స్థాపించబడిందనే వాస్తవమే బాప్తిస్మమిచ్చు యోహాను దాన్ని స్థాపించలేదని తిరుగులేని ఋజువై యున్నది. అది ఏ మానవునిచే స్థాపించబడలేదు.

2. సంఘాన్ని నిర్మిస్తానని యేసు వాగ్దానం చేసే సరికి యోహాను చనిపోయాడు. మత్తయి 14:10లో యోహాను చంపబడుటను గూర్చి ఈలాగు మనము చదువగలము : "హేరోదు బంటౌతును పంపి చెరసాలలో యోహాను తలగొట్టించెను." మనము రెండు అధ్యాయములు ముందుకు వెళ్ళి మత్తయి 16 : 18లో క్రీస్తు "నా సంఘ

మును కట్టుదునని" వాగ్దానము చేయుసరికి యోహాను చనిపోయి యుండెనని మనము మనసు నందుంచుకోవాలి. కట్టుదునను మాట భవిషత్కాలాన్ని సూచించుచున్నది. యోహాను మృతి జెందాడు. సంఘస్థాపనము ఇంకా భవిష్యత్తులో యుండెను. బాప్తిస్మమిచ్చు యోహాను గొప్పవాడు. అతడు లేఖనముల ప్రికారమైన పనిని చేసాడు. ప్రజలు ప్రభువు నంగీకరించులాగున అతడు ప్రభువుకు ముందుగా వెళ్లినవాడు (యెషయా 40:3; మలాకీ 3:1; లూకా1:17). యోహాను ఈ పనిని చేసాడు గాని అతడు బైబిలు సంఘాన్ని గాని, మానవు లెరిగిన మరి యే సంఘాన్ని గాని స్థాపించలేదు.

3. యేసు తన సంఘాన్ని స్థాపించెదనని వాగ్దానం చేయుటలో, యోహానుచే అప్పటికే స్థాపించబడి యున్నదానితో జంటగా యున్న దానినిగూర్చి మాత్రిమే వాగ్దానం చేసెనని నిరూపించలేము. ఈవాదన నిలబడదు; ఎందువలనంటే యేసు తన సంఘాన్ని పునాదినుండి కట్టుటకు వాగ్దానం చేసాడు. "ఈ బండమీాద నా సంఘమును కట్టుదును".

4. బాప్తిస్మమిచ్చు యోహాను ఎన్నడు సంఘసభ్యుడుగాని, పరలోకరాజ్య పౌరుడుగాని కాడు. యేసు ఇట్లు చెప్పాడు: "స్త్రీలు కనినవారిలో బాప్తిస్మమిచ్చు యోహానుకంటె గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీాతో చెప్పుచున్నాను. అయినను పరలోక రాజ్యములో అల్పుడైనవాడు అతనికంటె గొప్పవాడు" (మత్తయి 11:11). స్త్రీలు కనినవారిలో యోహాను గొప్పవాడైనప్పుడు పరలోక రాజ్యములో అల్పుడైనవాడు అతనికంటె గొప్పవాడెట్లు కాగలడు? ఈ ఉదాహరణ దాన్ని వివరించగలదు: ఎలిమెంటరీ స్కూలులో ఆనంద్‌కంటె గొప్పవాడు లేడు. అయినను హైస్కూలులో అల్పుడైన వాడు అతనికంటె గొప్పవాడు; ఇది వాస్తవం. ఏలయనగా ఆనంద్ హైస్కూలులో లేడు. అట్లే బాప్తిస్మమిచ్చు యోహాను సంఘములో గాని, పరలోక రాజ్యములోగాని లేడు.

## IV ఇతర మొక్కలు పెల్లగింపబడును

క్రీస్తు సంఘము క్రీస్తుచే స్థాపించబడినది. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు; గాని యితర మొక్కలు పెల్లగింపబడతాయి. తండ్రియైన దేవుడు స్థాపించని యితర సంఘములలో యుండడాన్ని గూర్చిన హెచ్చరిక చాల ఖచ్చితమైనది, శిక్ష కూడ చాల కఠినమైనది. పెద్దల పారంపర్యాన్ని బట్టి స్థాపించబడిన మతములను గూర్చి చెబుతు, "పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును" అని యేసు చెప్పాడు (మత్తయి 15:13). యిది మోషే ధర్మశాస్త్ర కాలమందు చెప్పబడింది. దేవుడు హెబ్రీయుల మతాన్ని స్థాపించాడు. మిగిలినవి పెల్లగింపబడతాయి. ఆనాటి ఆరాధన పద్ధతిక్రింద ఉన్న యితర మొక్కలను దేవుడు పెల్లగించిన యెడల, క్రైస్తవ పద్ధతిలో యున్నవాటిని పెల్లగించడా? ఆత్మీయ స్థాయి యేమీ తగ్గించబడలేదని మనం అంగీకరించాలి. గనుక క్రైస్తవ యుగంలో యున్న నేటి పరిస్థితికి ఆ హెచ్చరిక వర్తించవలసియున్నది. ప్రభువు యిచ్చిన హెచ్చరికను మనము మన్నించదముగాక.

—లీరోయ్ బ్రౌన్లో

---

## దేవుని యెడల ధనవంతుడు
### (*Rich towards God*)

లోకములో ధనమునకు, ధనవంతునికి కూడా ఎక్కువ విలువ ఉన్నది. ధనవంతుని ప్రేమించువారు అనేకులు. దరిద్రుడు తన పొరుగు వారికి అసహ్యుడు. అయితే ధనము మంచిదైనను దానిని పొందిన వారనేకులు కీడులో పడుచున్నారు. క్రైస్తవులైనవారు కూడా అందు పడే అవకాశము కలదు. వారు సత్యమైన, నిత్యమైన ధనమును సంపాదించి, దేవుని ఎడల ధనవంతులు కావలెనని దేవుని కోరికయైయున్నది.

మోసముచేత సంపాదించిన ధనము క్షీణించి పోవును. కష్టము

చేసి కూర్చుకొనువాడు తన ఆస్తిని వృద్ధి చేసికొనును. (సామెతలు 13:11). ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి (1 తిమోతి 6:10). దోచుకొనుటచేత గర్వపడకుడి. ధనము హెచ్చినను దానిని లక్ష్యపెట్టకుడి (కీర్తన 61:10).

ఒకడు ధనసంపన్నుడైనపుడు వాని ఇంటి ఘనత విస్తరించినపుడు భయపడకుము. వాడు చనిపోవునపుడు ఏమియు కొంచుపోడు. వాని ఘనత వానివెంట దిగదు (కీర్తన 49:16, 17). వాడు ఏ ప్రకారముగా తల్లి గర్భమునుండి వచ్చెనో ఆ ప్రకారముగానే తాను వచ్చినట్లే దిగంబరిగానే మరల పోవును. తాను ప్రయాసపడి చేసికొనిన దానిలో ఏదైనను చేతపట్టుకొని పోడు. అతడు వచ్చిన ప్రకారముగానే మరల పోవును (ప్రసంగి 5:15).

భూమిమీద ధనమును సంపాదించి, దేవుని వ్యతిరేకించిన ధనవంతుని కథను క్రీస్తు చెప్పెను. అతడు తనకు కలిగిన కలిమివలన గర్వపడి, దేవుని విసర్జించినాడు. అందువలన దేవుడుకూడా అతనిని విసర్జించాడు (లూకా 12:16-20). గనుక ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలముకాదు. ధనము శాశ్వతముకాదు. ధనమును నమ్ముకొనువాడు పాడైపోవును (సామెతలు 27:24, 11:28).

భూమిమీద మీ కొరకు ధనము కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును. దొంగలు కన్నమువేసి దొంగిలెదరు. పరలోకమందు మీకొరకు ధనమును కూర్చుకొనుడి, అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నమువేసి దొంగిలరు (మత్తయి 6:19, 20).

నీ ధనమెక్కడ ఉండునో నీ హృదయము అక్కడనే ఉండును (లూకా 12:34). పైనున్న వాటిమీదనే గాని భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనకుడి. ఏలయనగా మీరు మృతి పొందితిరి.

మీ జీవము క్రీస్తుతో కూడా దేవునియందు దాచబడియున్నది. మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షపరచబడుదురు (కొలస్స 3:2-4).

మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృప నెరుగుదురు గదా! ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను (2 కొరింథి 8:9).

కావున ప్రియ సహోదరులారా! ఇహమందుకంటె పరలోకమందు ధనవంతులగుటకు ఆశ కలిగి ప్రయాసపడుదము.

—రెడ్డిబాబు సబ్బతి, నూతిరామన్నపాలెం.

---

# యజ్ఞము

క్రీ॥ శే॥ అధ్యక్ష అనుభవానంద కేశవరాజశర్మ మండపాక

లోకములోని మానవులందరును దైవాజ్ఞోల్లంఘన జేసి, పాపపతితులై దేవునివలన శిక్షకు పాత్రులై యున్నారని తెలిసికొని, యట్టి శిక్షను తప్పించుకొని తరించుటకై వివిధ ప్రయత్నముల జేయుచున్నారు. ఇట్టి యుద్దేశముతోడనే మనదేశమందు బ్రాహ్మణాదులు యజ్ఞాది క్రతువుల జేయుచున్నారు. శూద్రాదులు బలుల నర్పించుచున్నారు.

## యజ్ఞకర్మ ప్రాముఖ్యము

వేదశాస్త్రములను పరిశీలించి చూచిన యజ్ఞమే తరుణోపాయముగా వివరింపబడి యున్నది. "ప్రథమాని ధర్మాణి" అనగా, యజ్ఞములు ప్రధానమైన ప్రథమ ధర్మములనియు; "యజ్ఞో వై భువనస్యనాభిః" (ఋగ్వేదము 1.164.35) అనగా, లోకమునకు యజ్ఞము ముఖ్యాధారమై యున్నదనియు; "యజ్ఞే సర్వం ప్రతిష్ఠితం" అనగా, యజ్ఞమే సర్వము ననుగ్రహించుననియు; "యజ్ఞో వై సుతర్మా నౌః" (ఋగ్వేద బ్రాహ్మణము 1.3.13) అనగా, యజ్ఞమే సుకరముగా తరింపజేసెడు

నావ యనియు; "యజ్ఞేనహి దేవా దివంగతాః" అనగా, యజ్ఞము వలననే దేవతలు స్వర్గము జెందిరనియు; "ఋతస్యనః పథానయాతి విశ్వానిదురితా" (ఋగ్వేదము 10.311.6) అనగా, యజ్ఞమను మార్గము గుండ సర్వపాపముల నుండి తొలగించి సురక్షితముగా దోడ్కొని పోమ్ము అనియు వేదములు ఘోషించుచు యజ్ఞము పాపనివారణ కొరకు తప్పక జేయవలసిన ముఖ్యకర్మయని బోధించుచున్నవి.

మరియు భగవద్గీతయందు గూడ,

"శ్లో॥ సహయజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ॥
అనేన ప్రసవిష్య ధ్వమేషవో స్త్విష్ట కామధుక్" (3.10)

అనగా, ప్రజాపతి ఆదియందే ప్రజలతో గూడ యజ్ఞములను సృష్టించి యిది మీ యభీష్టములగు కోరికల నిచ్చుగాక యని చెప్పె ననియు; "యజ్ఞక్షపిత కల్మషాః" (4.30) అనగా, యజ్ఞములచేత నశింపజేయబడిన పాపములు కలవారనియు; "నాయంలోకో స్త్య యజ్ఞస్యకుతోన్యః కురుసత్తమః" (4:31) అనగా, ఓ కురుశ్రేష్ఠుడా! యీ చెప్పిన యజ్ఞములలో నొక్కటినైన చేయనివానికి యిహలోకము లేదు. యిక పరమెట్లుండును? అనియు యజ్ఞకర్మ ముఖ్యమైనదిగా వివరింపబడి యున్నది.

## యజ్ఞములు ఒక మహాయజ్ఞ ఛాయలు

ఐనను ముండకోపనిషత్తునందు, "శ్రు॥ ప్లవాహ్యేతే అదృఢా యజ్ఞరూపాః" (2.7) అనగా, యజ్ఞరూపములైన తెప్పకొయ్యలు గట్టివి కావనియు; స్కాందపురాణము, యజ్ఞవైభవ ఖండము 7వ అధ్యాయమున, "శ్లో॥ ప్లవాహ్యేతేసురాయజ్ఞాఅదృఢాశ్చనసంశయః" అనగా, దేవతలారా, యజ్ఞములు తెప్పకొయ్యలవంటివి. అవి గట్టివి కావనుటకు సంశయము లేదు అనియు; తాండియ మహాబ్రాహ్మణములో, "శ్రు॥ యజ్ఞోవా అవతి తస్యఛాయాక్రియతే" అనగా,

యజ్ఞమే రక్షించుచున్నది; దానియొక్క ఛాయయే జరుపబడుచున్నది అనియు; ఋగ్వేదమందు, "శ్రు॥ ఆత్మదా బలదాః యస్యఛాయా మృతం యస్యమృత్యుః" (10.121.2) అనగా, యెవనియొక్క ఛాయయును మృత్యువును అమృతమగునో, అతని ఛాయామృత్యువులు ఆత్మకు బలమును నిచ్చునవిగ నున్నవనియు; చెప్పబడి యుండుటచే నీ జరుపబడు యజ్ఞములే ముక్తిదాయకములు గావనియు, నిజముగ ముక్తిదాయకమగు నొక మహాయజ్ఞమున కివి సూచనలై దాని ఛాయలుగ నున్నవనియు తేటబడుచున్నది.

## మహాయజ్ఞ విశేషము

తైత్తిరీయ బ్రాహ్మణమందు "శ్రు॥ యజమానః పశుః యజమాన మేవ సువర్గం లోకం గమయతి". (బంగాళ పత్రము 202) అనగా, యజ్ఞము చేయువాడే యజ్ఞపశువు. కాబట్టి యజ్ఞము చేయువాడే స్వర్గమేగును అనియు; శతపథబ్రాహ్మణమందు "ప్రజాపతిర్యజ్ఞః" అనగా, ప్రజాపతే యజ్ఞమనియు; సామవేదమందలి తాండ్యమహా బ్రాహ్మణములో, "శ్రు॥ ప్రజాపతిర్దేవేభ్య ఆత్మానం యజ్ఞంకృత్వా ప్రాయశ్చిత్" (బంగాళా పత్రము 410) అనగా, ప్రజాపతి తనను తానే యజ్ఞముగా అర్పించుకొని ప్రాయశ్చిత్తము నెరవేర్చెను అనియు; శతపథ బ్రాహ్మణమందు, "తస్య ప్రజాపతే రర్ధమేవ మర్త్యమాసి ద్దర్ధమమృతం" అనగా, ఆ ప్రజాపతి సగము మర్త్యుడుగను సగము అమర్త్యుడుగను అయ్యెను. అనగా, దైవత్వ మానవత్వము లాయన యందు కలసియుండెననియు; పురుషసూక్తమందు విరాట్పురుషుని యజ్ఞము చేసినట్టును తెలియపరచబడి యుండుటచే, లోకాధిపతియగు నా పరాత్పరుడు మర్త్యా మర్త్యత్వమును వహించి దైవమానవుడై యవతరించి, తానే యజ్ఞపశువై మానవులను తరింపజేయుటకై యజ్ఞమగుటయే నిజముగ ముక్తిదాయకమగు మహాయజ్ఞమని స్పష్టమగుచున్నది.

ఋగ్వేదమందు యజ్ఞపశువునుగూర్చి : 1. మచ్చలేని మేక గావలెను; 2. దాని తలకు బలుసుకంప చుట్టవలెను; 3. దానిని యూప స్థంభమునకు కట్టవలెను; 4. దాని నాలుగుకాళ్ళలోను రక్తముకారునట్లు మేకులు కొట్టవలెను; 5. మేకకు కప్పిన పచ్చడము ఋత్విక్కులు నలుగురును పంచుకొనవలెను; 6. దాని యెముకలలో నొకటియు విఱువకూడదు; 7. మేకకు సోమరసము పట్టవలెను; 8. దాని వధించిన పిమ్మట ప్రాణ ప్రతిష్ఠ చేయవలెను; 9. దాని మాంసమును భుజింపవలెను అని వివరింపబడి యుండుటచేతను, ఈ నిష్కళంక దైవావతార మూర్తియొక్క లోకరక్షణార్థ యజ్ఞమరణమందీ సూచనలకు సరియైన యర్థానుగుణ్యమగు సంగతులు జరిగి యుండవలెనని బోధపడుచున్నది.

ఇట్లు భగవంతుడే యవతరించి పాపాత్ముల రక్షణకై తానే యజ్ఞము కావలెనని తెలియజేయ బడియున్నను అట్లు భగవంతుడవతరించి పాపరక్షణార్థమై యజ్ఞముగా చనిపోయినట్లు మనదేశపు అవతార చరిత్రల యందుగాని, శాస్త్రములయందుగాని గానరాదు. కాని మన ఆసియాఖండమందే పశ్చిమదిశను మధ్యధరా సముద్రతీరమున భూమధ్యదేశమగు పాలస్తీనా (ప్రస్తుత ఇశ్రాయేలు) దేశమందొక పరిశుద్ధ కన్యకాగర్భమున నుద్భవించిన దైవావతారుని యందీ లక్షణములన్నియు గానవచ్చుచున్నవి. కేవలము నిష్కళంకుడై పరమపవిత్ర జీవితము కలిగియుండి, మర్త్యామర్త్యతలు, అనగా దైవత్వ మానవత్వములు మూర్తీభవించి కలిసియుండి యీయన, తాను మానవరక్షణార్థము యజ్ఞముగా చనిపోయి తిరిగి మృత్యుంజయుడై జీవించునని మొదటినుండియు చెప్పియుండెను. పాపాసక్తులై యీయన బోధనా జీవితముల నిష్టపడక నీయనను చంపనుద్దేశించిన దుర్మార్గులకు తనంతట తానే పట్టుబడి పురుషసూక్తమందలి విరాట్పురుష యజ్ఞమువలె నా దుష్టులచే జంపబడిన విధము పరిశీలనచేసి చూడగా ఋగ్వేదమందు

యజ్ఞపశువునుగూర్చి వివరింపబడిన దంతయు నీ క్రిందివిధముగా నీయన యందు నెరవేరినట్లు ప్రత్యక్షముగ గనపడుచున్నది.

1. మచ్చలేని మేక యన్నట్లు-ఈయన పాపములేని దైవ మానవుడు.

2. దాని తలకు బలుసుకంప చుట్టవలెన్నట్లు - ఈయన తలను ముండ్ల కిరీటము బెట్టిరి.

3. దానిని యూప స్తంభమునకు కట్టవలెనన్నట్లు-ఈయనను సిలువయను గొరతమ్రానిపై నంటగొట్టిరి.

4. దానికి నాలుగు కాళ్ళలోను రక్తము కారునట్లు మేకులు కొట్టవలెనన్నట్లు-ఈయన కాళ్ళకు, చేతులకు మేకులను గొట్టిరి.

5. మేకకు కప్పిన పచ్చడము నలుగురు ఋత్విక్కులు పంచు కొనవలెనన్నట్లు-ఈయనను సిలువ వేసిన వారాయన వస్త్రములను పంచుకొనిరి.

6. దాని యెముకలలో నొకటియు విరువకూడదన్నట్లు-ఈయన యెముకలలో నొకటియు విరువలేదు.

7. మేకకు సోమరసము పట్టవలెనన్నట్లు-ఈయనకు చిరక నిచ్చిరి.

8. దానికి వధానంతరము ప్రాణప్రతిష్ట చేయవలెనన్నట్లు-ఈయన మృత్యుంజయుడై లేచెను.

9. దాని మాంసము భుజింపవలెనన్నట్లు - ఈయన లోకరక్షణా ర్థమై తాను యజ్ఞముగా నర్పించుచున్న తన శరీర రక్తములను తన భక్తులు భుజించి పానించవలెననియు, అందుకు సూచనగా తన మరణ మును తరుచుగా జ్ఞాపకము చేసికొనుచు, రొట్టెను, ద్రాక్షరసమును పుచ్చుకొన వలెననియు తన మరణాత్పూర్వము తన భక్తుల కాజ్ఞాపించి యొక యాచారమును నిర్ణయించెను. ఇప్పటికిని యట్లే జరుగుచున్నది.

ఇట్లు పాలస్తీనా (ప్రస్తుత ఇశ్రాయేలు రాజ్యము)లో వెలసిన యవతారమందే పాపాత్ముల రక్షణకైన ప్రాయశ్చిత్తార్థ యాగము నెరవేర్చబడి యుండుటచే నిదియే పాపాత్ముల ముక్తికై నమ్మవలసిన సత్యమైన విరాట్పురుషావతారమని విస్పష్టమగుచున్నది. ఇదియే యేసుక్రీస్తు అవతారము.

పురుషసూక్తము, "నాన్యఃపంథా అయనాయ విద్యతే" అనగా, పై నుదహరించిన యాగముగ నర్పించుకొనిన విరాట్పురుషుని వల్ల తప్ప వేయికర్మలవల్లనైనను మోక్షప్రాప్తి కలుగదని తెలియపరచుచున్నది.

యేసుప్రభువిట్లు సెలవిచ్చెను: నేనే మార్గమును, సత్యమును, జీవమును, నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును: బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు (యోహాను 14:6, 11:25, 26). ప్రయాసపడి (పాప) భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును (మత్తయి 11:28).

కాబట్టి యేసుక్రీస్తువల్లగాక "మరి ఎవనివలనను రక్షణ కలుగదు: ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అ.కా. 4:12).

(ఈ వ్యాసము శ్రీ D.S. మండపాక, హైదరాబాద్-20 వారి అనుమతితో ఇందు ముద్రించడమైనది)

గమనిక

మావద్ద బైబిళ్లు, కీర్తన పుస్తకములు కలవు. బైబిలు ఖరీదు 15/- రూ॥లు. పోస్టేజీ 8/- రూ॥లు అదనం. కీర్తన పుస్తకం ఖరీదు 5/- రూ॥లు. పోస్టేజీ ఉచితం. ఈ దిగువ చిరునామాకు M.O. చేసి పొందండి.

SATYA VANI
P.O. Box 80, Kakinada-533 003

# నిశ్చలమైన రాజ్యము
## (A Kingdom that can not be Shaken)

—జె. సి. బెయిలీ

మనమొక నిశ్చలమైన రాజ్యమును పొందవలసి యున్నామని హెబ్రీ 12:28 లో పరిశుద్ధాత్ముడు చెప్పాడు. ఈ రాజ్యమునుగూర్చి దానియేలు 2:44 లో దానియేలు ప్రవచించాడు. ఈ రాజ్యము నిత్యము నిలుచునని అతడు చెప్పాడు. దానియేలు గ్రంథము రెండవ అధ్యాయములో అతడు నాలుగు భూరాజ్యములనుగూర్చి చెప్పాడు. పరలోక రాజ్యము ఆసన్నమై యున్నదని చెప్పుచు బాప్తిస్మమిచ్చు యోహాను రాకముందు ఈ నాలుగు భూరాజ్యములు వచ్చెనని చరిత్ర చెప్పుచున్నది (మత్త 3:2). యోహాను శిరచ్ఛేదనము చేయబడ్డాడు. యేసు బహిరంగ సువార్తను మొదలుపెట్టి పరలోక రాజ్యము సమీపించి యున్నదని ప్రకటించాడు (మత్త 4:17). ఆ రాజ్యము ఎంత సమీపముగా యుండెనో ఆయన మనకు చెప్పాడు; ఏలయనగా రాజ్యము బలము, లేక శక్తితో వచ్చువరకు మరణమును రుచి చూడని కొందరు అక్కడున్నారని ఆయన చెప్పాడు (మార్కు 9:1). పునరుత్థానుడైన క్రీస్తును ప్రకటించడానికి వారు వెళ్ళక ముందు అపొస్తలులకు యెరూషలేములో ఈ శక్తి వచ్చునని పరిశుద్ధాత్ముడు చెప్పాడు: "ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచి యుండుడి" (లూకా 24:49). యేసు ఈ లోకాన్ని విడిచిపెట్టకముందు, ఆ శక్తి ఎప్పుడు వచ్చునో చెప్పాడు: "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను యూదయ సమరయదేశముల యందంతటను, భూదిగంతముల వరకును నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను" (అపో.కా. 1:8). గనుక నిత్యము నిలుచు రాజ్యమును ప్రభువు

స్థాపించునని మనము గ్రహించాము. ఆ రాజ్యము సమీపించి యున్నదని యోహాను చెప్పాడు. యేసుతో యున్న వారి జీవిత కాలములోనే అది వచ్చునని యేసు చెప్పాడు. ఆ రాజ్యము శక్తితో వచ్చునని ఆయన చెప్పాడు. ఆ శక్తి యెరూషలేములో వచ్చునని, పరిశుద్ధాత్ముడు వచ్చినప్పుడు అపొస్తలులు ఆ శక్తిని పొందెదరని మనం గ్రహించాము.

## సర్వాధికారి క్రీస్తు

యేసు ఈ భూమిని విడిచిపెట్టకముందు, ఆయనకు ఇహపరములయందు సర్వాధికార మీయబడి యున్నదని చెప్పాడు (మత్త 28:18). యేసు మృతులలో నుండి లేచినప్పుడు యేసుకు శక్తి యుండెనని పరిశుద్ధాత్ముడు చెప్పాడు. “మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెను” (రోమా 1:7). తరువాత పెంతెకొస్తునాడు పేతురు ఇట్లు ప్రసంగించాడు: “మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెను” (అపొ.కా. 2:36). గనుక క్రీస్తు రాజ్యము ఆయన పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తునాడు ఆరంభమాయెనని బైబిలునుంచి తెలిసికొని నిరూపించగలము.

## పరలోక ప్రార్థన ఎందుకు చేయరు ?

మీరు ‘పరలోక ప్రార్థనను’ ఎందుకు చేయరని ప్రజలు తరుచు మమ్మల్ని అడుగుతారు. దానిని ఆయన అపొస్తలులకు ఒక మాదిరి ప్రార్థనగా యిచ్చాడు. “కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి” అని ఆయన చెప్పాడు (మత్తయి 6 : 9). వారు మొదట దేవుని రాజ్యమును నీతిని వెదకాలని చెప్పబడింది (మత్త 6:33). వారు వెదకినది వ్యర్థమయ్యిందా? లేదు. పెంతెకొస్తునాడు రాజ్యము ఆరంభమాయెనని మీకు చూపించాను. ప్రభువు మనకు ఇచ్చేసిన

దానిని గూర్చి ఇంకా ఇమ్మని మనం ప్రార్థించము. అందువలన నిశ్చలమైన రాజ్యమును మనం పొంది యున్నాము గనుక మనం ప్రభువుకు కృతజ్ఞత చెల్లిస్తాము. 'నీ రాజ్యము వచ్చును గాక' యని ఇప్పుడు ప్రార్థించడం అపహాస్యం. రాజ్యము వచ్చేసింది. పెంతెకొస్తు తరువాత దాన్నిగూర్చి ఎక్కడైనా చెప్పబడితే అది వచ్చేసిందనే భావంతోనే చెప్పబడింది. అనేక శ్రమలు అనుభవించి దేవుని రాజ్యములో ప్రవేశించాలని క్రొత్తగా మార్పుజెందిన వారికి పౌలు చెప్పాడు (అపొ. కా. 14:22). తరువాత వచనంలో వారు ప్రతి సంఘములోను పెద్దలను ఏర్పరచారని చెప్పబడింది. మానవులు కాదని ఎంత బోధించినా సంఘము, రాజ్యము ఒక్కటే. యిది ఒకే ఒక్కటి; ఏలయనగా శరీరము ఒక్కటే (ఎఫెసీ 4:4). శరీరమే సంఘము (ఎఫెసీ 1:22, 23). యేసుక్రీస్తే సంఘాన్ని రాజ్యాన్ని ఒకేదానిగ చేసాడు. "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోక రాజ్యముయొక్క తాళపుచెవులు నీ కిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును; భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను" (మత్తయి 16:18, 19).

తరువాత మనం కొలస్స 1:13 చదువుదాం : "ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్య నివాసులనుగా చేసెను". తరువాత 18వ వచనములో, "సంఘమను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" అని చెప్పబడినది. యేసుకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగాలంటే ఆయన ఇప్పుడు తప్పక పాలించుచుండాలి; లేదా ఆయనకా ప్రాముఖ్యత లేదు.

## రాజ్యము భూ సంబంధమైనది కాదు

యేసు అసలు రాజ్యము స్థాపించాలనుకొన్నాడు గాని యూదు లాయనను తిరస్కరించినప్పుడు దానికి బదులుగా ఆయన సంఘాన్ని స్థాపించాడని బోధించేవారున్నారు. ఈ సిద్ధాంతానికి లేశమైనను ఋజువు లేదు. రాజ్యము స్థాపించబడియున్న వాస్తవంగా లేఖనములు పదే పదే బోధించుచున్నట్లు చూచాము. యేసు ఈ భూమిమీద రాజ్యాన్ని స్థాపిస్తాడని కొందరంటారు. "యేసు - నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహసంబంధమైనది కాదు" అని యోహాను 18:36లో చెప్పినప్పుడు ఆయన భూసంబంధమైన రాజ్యాన్ని ఎట్లు స్థాపిస్తాడు? భావిలో ఎప్పుడో యేసు భూసంబంధమైన రాజ్యాన్ని స్థాపిస్తాడని చెప్పే ఈ సిద్ధాంతము యేసు చెప్పిన మాటలకు కేవలం వ్యతిరేకంగా యున్నది. మనం ఇంకా ముందుకు వెళదాం. యేసు బహిరంగ సువార్త సేవారంభించినప్పుడు రాజ్యము సమీపముగా యున్నదని బోధించాడని ప్రజలెరుగుదురు. యోహానుకూడ రాజ్యము ఆసన్నమై యున్నదని బోధించాడని వారెరుగుదురు గనుక వారు యేసునొద్దకు వెళ్ళి రాజ్యము ఎప్పుడు రాబోవుచున్నదని అడిగారు. దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదని ఆయన చెప్పాడు (లూకా 17:20). యేసు ఈ భూలోక రాజ్యాన్ని స్థాపిస్తాడని చెప్పేవారు ఆ రాజ్యము ప్రత్యక్షముగా వస్తాదని చెప్తారు. "దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నదని" యేసు చెప్పాడు (లూకా 17:21).

ఇప్పుడు మనం సంఘ యుగంలో జీవించుచున్నామని ప్రజలు చెబుతారు. క్రీస్తు వచ్చినప్పుడు మనం రాజ్యయుగంలో యుంటామని వారంటారు. సంఘయుగాన్నిగూర్చి, రాజ్యయుగాన్నిగూర్చి బైబిలు

ఎన్నడు చెప్పలేదు. సంఘము ఆయన నిత్యసంకల్పమని అది చెప్పు చున్నది (ఎఫె 3:10, 11). గనుక కొందరు చేయు వ్యర్థబోధవలె గాక సంఘము తరువాత చేసికొన్న సంకల్పము కాదు. సంఘం తరువాత యుండే యుగం ఏమీలేదు. "క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక" యని వ్రాయబడి యుండుట మనం చూడగలము (ఎఫె 3:21). అపొ. పౌలు అపొ.కా. 27:25 లో చెప్పిన మాట ఇక్కడ చేర్చాలని నేను కోరుచున్నాను: "నాతో దూత చెప్పిన ప్రకారము జరుగునని నేను దేవుని నమ్ము చున్నాను". మనం నేర్చుకొన్నదాని నంతటిని జాగ్రత్తగా ఆలో చించు. ఆయన చెప్పిన ప్రకారం జరుగుతాదని నేను రూఢిగా నమ్ము చున్నాను.

## క్రొత్తజన్మద్వారా రాజ్యములోనికి

తిరిగి జన్మించిన క్రైస్తవుని గూర్చి మనం చాల వింటూ యున్నాము. నీవు క్రైస్తవుడవైతే తిరిగి జన్మించినవాడవు. తిరిగి జన్మించడాన్ని గూర్చిన వాస్తవాన్ని ఒకసారి చూద్దాం. తిరిగి జన్మించిన వారెక్కడ ఉన్నారు? "ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని" యేసు చెప్పాడు (యోహాను 3:3). ఈ మాటయొక్క భావం యేమిటి? క్రొత్తగా జన్మించినవారు దేవుని రాజ్యాన్ని చూస్తారు. రాజ్యము లేకపోతే ఒకడు క్రొత్తగా ఎట్లు జన్మిస్తాడు? క్రొత్త జన్మనుగూర్చి నీకోదేము ఇంకా ప్రశ్నిస్తే యేసు ఇట్లు చెప్పాడు: "ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చ యముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5). గనుక రాజ్యము లేకపోతే క్రొత్తజన్మ లేదు. అబద్ధ బోధవలన ప్రజలు వింతైన సందిగ్ధంలో పడవలసి వస్తాది.

దేవుని వాక్యాన్ని చదువుటద్వారా ఒకేఒక్క శరీరమున్నదని

మనం తెలుసుకొన్నాము. ఆ శరీరాన్ని సంఘమనిగాని రాజ్యమని గాని పిలువవచ్చు. ఇంకా ఎక్కువ ఋజువు అనవుసరంగాని హెబ్రీ పత్రికనుండి కొంత చదువుదాం: "తన కుమారునిగూర్చి యైతే, దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది; నీ రాజదండము న్యాయార్థ మయినది" అని చెప్పాడు (హెబ్రీ 1:8). సింహాసనము నిలిచి యున్న దని పరిశుద్ధాత్మ డు చెప్పాడు. అది నిలిచి యుండెననిగాని, నిలిచి యుంటాదనిగాని ఆయన చెప్పలేదు. అది నిరంతరముండునదని ఆయన చెప్పాడు. ఇప్పుడు మనం హెబ్రీ 12:23 ను చూద్దాం: "పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘమునకు, వారి మహోత్సవము నకు—". సంఘము పరలోకమందు వ్రాయబడి యున్నది. అయితే 28 వ వచనములో ఈ జ్యేష్ఠుల సంఘాన్ని నిశ్చలమైన రాజ్యమని చెప్పుచున్నాడు.

## వెయ్యేండ్ల పాలన అసంభవం

యేసు మరల ఈ భూమిమీద తన పాదములను మోపుతాడని చెప్పే లేఖనం యేదీ లేదు. ప్రభువు రాకడనుగూర్చి ఇట్లు చదువుతాం: "ఆర్భాటముతోను ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగి వచ్చును; క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండల మునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము" (1 థెస్స 4:16, 17). ఈ మాట ఆలోచించుము: ప్రభువును ఎదుర్కొనడానికి ఆకాశమండలా నికి మనము కొనిపోబడతాం. కాగా మనము సదాకాలము ప్రభువుతో ఉంటాం. క్రీస్తుతో కలసి భూరాజ్యముచేసే ప్రసక్తే లేదు.

రాజ్యము ఇంకా భవిష్యత్తులో యుందని బోధించేవారు ముందు నీతిమంతులు లేపబడతారు, ఆ తరువాత వెయ్యి సంవత్సరము

లకు దుష్టులు లేపబడతారని చెబుతారు. మన ప్రభువుయొక్క ఉప దేశానికి ఇది వ్యతిరేకముగా యున్నది; ఏలయనగా నీతిమంతులు అనీతిమంతులు ఒకే గడియలో లేపబడుదురని ఆయన చెప్పాడు (యోహాను 5:28, 29). ఒకే గడియలో వెయ్యి సంవత్సరములుండ జాలవు. దీనికితోడు యోహాను సువార్త 6వ అధ్యాయములో నీతి మంతులు అంత్యదినమున లేపబడుదురని యేసు నాలుగుసార్లు చెప్పాడు (39, 40, 44, 54 వచనాలు). ఆఖరిదినం తరువాత సమయం ఇంకేమీ యుండదు. అంత్యదినం తరువాత మనం నిత్యత్వాన్ని పొందుతాం. అంత్యదినం తరువాత క్రీస్తుయొక్క వెయ్యేండ్ల పాలన యుండజాలదు. యేసు ఆరోహణమవడం ఈలాగు చెప్పబడింది: "ఈ మాటలు చెప్పి వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండా ఒక మేఘము ఆయనను కొనిపోయెను" (అపొ. కా. 1:9). మేఘానికి ఆవల యేమిజరిగిందో దానియేలు మనకు తెలియజేయుచున్నాడు: "ఆకాశ మేఘరూఢుడై మనుష్యకుమారుని పోలిన యొకడు వచ్చి, ఆ మహావృద్ధుడగు వాని సన్నిధిని ప్రవేశించి ఆయన సముఖమునకు తేబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది; అదెన్నటికిని తొలగిపోదు. ఆయన రాజ్యము ఎప్పుడును లయము కాదు" (దానియేలు 7:13, 14).

ఆసియలోని యేడు సంఘాలకొక వర్తమానాన్ని యోహాను అందుకొన్నాడు: "ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసెను" అని ప్రభువు నిర్ధారణ నిచ్చియున్నాడు (ప్రకటన 1:6). సత్యం సత్యానికి ఎన్నడు భిన్న ముగా యుండదు. మనం నేర్చుకొన్న సత్యానికి విరుద్ధంగా ప్రక టన గ్రంథం 20వ అధ్యాయం యేమీ బోధించుటలేదు. అది అసంభవము.

# ఆత్మ - శరీరము

"మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7). ఇది మానవులకు ప్రభువుద్వారా యివ్వబడిన మానవుని మరణమును గూర్చిన నిర్వచనము. మరొక మాటలో మరణమనగా 'శరీరము నుండి ఆత్మ వేరగుట'. సర్వశక్తిమంతుడు, సృష్టికర్తయైన దేవుని నుండి ఆత్మ మానవునికి దయచేయబడి యుండెను. "ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు" (అ.కా. 17:25).

ఆత్మ దేవునిద్వారా యివ్వబడినందున అది మిక్కిలి ఉత్కృష్ట మైనది, విశిష్టమైనది, అక్షయమైనది. ఆత్మపై దేవునికి తప్ప ఏ మానవునికి అధికారము లేదు. యేసుక్రీస్తు ప్రభువు తన శిష్యులకు ఆత్మ యొక్క ఉన్నతస్థితినిగూర్చి చెప్పి వారిని "పరలోక రాజ్యము సమీపించి యున్నదని" ప్రకటించుటకు పంపెను. "ఆత్మను చంపనేరక, దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను శరీరమును నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి" (మత్త 10:28).

## ఆత్మ సంబంధులు

ఈ మాటను హృదయపూర్వకముగ అంగీకరించిన యోహాను సహోదరుడైన యాకోబు ఖడ్గమునుచూసి చలించలేదు (అ.కా. 12:2). "చావైతే లాభము" అని పౌలు చెప్పెను (ఫిలిప్పీ 1:21). ఈ విశ్వాసము నిమిత్తమే కొందరు "మరి శ్రేష్టమైన పునరుత్థానమును పొందగోరి విడుదల పొంద నొల్లక యాతన పెట్టబడిరి. మరికొందరు తిరస్కారములను కొరడా దెబ్బలను మరి బంధకములను ఖైదును అనుభవించిరి. రాళ్ళతో కొట్టబడిరి, రంపములతో కోయబడిరి, శోధింపబడిరి, ఖడ్గముతో చంపబడిరి" (హెబ్రీ 11:36, 37).

క్రైస్తవుడు మరణమునకు భయపడడు. యిదే క్రైస్తవునికి

క్రైస్తవేతరులకు మధ్యనుండు వ్యత్యాసము. వేలాది మంది ఆదిమ క్రైస్తవులు తమ దేహములను క్రీస్తుకొరకు మరణమునకు అర్పించిరి. సజీవ దహనము చేయబడిరి. మృగముల మధ్యకు త్రోయబడిరి. శిరచ్ఛేదము చేయబడిరి. యిన్ని శ్రమలలో క్రీస్తు సువార్త ఆనాడు మరింత ప్రతిధ్వనించెను. రోమా పాలకులు పెట్టిన హింసలను సంతోషముగ స్వీకరించిరి. వీరు ఆత్మసంబంధులు.

## శరీర సంబంధులు

నేడు మానవుడు ఆత్మకంటె శరీరమునకే ప్రాముఖ్యత నిచ్చుచున్నాడు. ఇది దేవుని చిత్తమునకు విరుద్ధమైనది. "శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయును" (గలతి 6:8).

శరీర అవసరతలకొరకు క్రీస్తుప్రభువును నమ్మినవాడు శరీర సంబంధి. మన ప్రభువు శరీర అవసరతలను కూడ తీర్చగలిగినవాడు: "ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" (మత్త 6:32-33). నీవు శరీర సంబంధమైన స్వస్థతకొరకు ప్రభువును నమ్ముకొనదలచిన యెడల నీవు శరీర సంబంధివే. దేవుడు ఆత్మ కనుక నీవు నీ ఆత్మను రక్షించుకొనుటకొరకు ప్రభువును నమ్ముము. బాప్తిస్మము పొందుము (మార్కు 16:16).

సర్వశక్తిమంతుడైన ప్రభువు తన బిడ్డలైన వారికి ఒక గొప్ప వాగ్దానము ఇచ్చియున్నాడు: "అడుగుడి మీ కివ్వబడును" (మత్త 7:7). ఇది ఎంతగొప్ప వాగ్దానము!

"నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు" (యోహా 18:36) అని క్రీస్తు చెప్పెను. క్రీస్తు శరీర సంబంధమైన లేక ఈ లోక

సంబంధమైన రాజ్యమును స్థాపించునని కొందరు ఆనాడు భయపడిరి. కొందరు సంతోషించిరి. క్రీస్తు స్థాపించిన రాజ్యము శాంతి సమాధానములతో నిండిన ఆత్మ సంబంధమైన రాజ్యము. అదే క్రీస్తు సంఘము.

ఆత్మ సంబంధమైన విషయములను మీరు మరింత వివరముగ తెలిసికొనుటకు "సత్యవాణి" రేడియో కార్యక్రమములు తప్పక వినండి. మీకు దగ్గరలోనున్న క్రీస్తు సంఘమును దర్శించండి.

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

Regd. No. H/KD—45/...

*From*
**SATYA WAKKU**
**P.O. Box. 80**
**KAKINADA-533 001**

To

.............................

.............................

.............................

.............................